# ఒకానొక అసంబద్ధ సంబద్ధత

'మూలుగు' నవలలోని దావూద్ ఎడ్వర్డ్ మంచ్ చిత్రించిన 'ది స్క్రీమ్' లోని భయపడ్డవాడు. దావూద్ ఒకే సమయంలో వీరుడు, భీరుడు న్నూ, అతనిచర్యలన్నీ అసంకల్పిత ప్రతీకార చర్యలే. నేటి విప్లవకారుల నిరాలోచనా నిర్గమ్య ఇన్ వాలంటరీ రియాక్షన్స్ మాత్రమే. దావూద్ లానే 'మూలుగు' నవల కూడా ఏకకాలంలో గొప్ప క్షుద్ర రచన, మహోత్కృష్ట రచన కూడా. ముందు ఇలాంటి క్షుద్ర రచనలు వస్తేగానీ మన తెలుగు నవలలోని సాదా సీదా నీచత్వం తొలగిపోదు. ఇలాంటి మహా రచన వస్తేగానీ విప్లవం పేరుతో మనల్ని,

అమాయకుల్ని చేసి ఉద్యమాల మాటున నిద్రపుచ్చే రచనలు అంతరించవు. దావూద్ లాంటి - ఏకకాలంలో నాయక ప్రతినాయకత్వ అస్థిత్వాలున్న పాత్రలు ప్రవేశిస్తేనేగాని సర్వగుణధాములుగా పోతపోసి రాసే అభూత విప్లవ రచనలు సమసిపోవు, శ్రీరామ కవచం సాగర్ ని ఏ సాల్మన్ రష్దీ కంటే, ఏ అరుంధతీ రాయ్‌కంటే ఏ మార్క్‌ట్వేన్‌కంటే ఎందుకు తీసికట్టుగా భావించాల్సి వస్తుందంటే - ఒకే ఒక్క కారణం కన్పిస్తోంది నాకు. అది తెలుగు ప్రపంచ భాష కాకపోవడం. మూలుగు ఒక అవాస్తవిక వాస్తవవాద నవలగా నేను గుర్తిస్తున్నాను. దీనిలోని శిల్పాన్ని నేను డ్రియారిటీ (డ్రీమ్+రియాలిటీ) గా పేర్కొంటున్నాను. ఐదుహంసలు నవలలోని రచనాశిల్పం, వాక్యవిన్యాసం మూలుగులో ఇంకా మరింత చిత్రంగా కొనసాగింది. మూలుగులోని మరణాలు మరణాలు కావు. మూలుగులోని జీవితాలు జీవనాలు కావు.

నవలాకారుడు ఈ 120 పేజీలలోనూ ఒకే ఒక్క వాక్యం రాశాడనీ, ఈ విశేషం కేవలం ఒక్క వాక్య నిర్మాణానికి మాత్రమే పరిమితమైన విషయం కాదు. కేవలం అకర్మక క్రియలను వాడటం మాత్రమే కాదు. ఒక కర్మకు వేరొక క్రియను వాడటం, కర్తను చెప్పకుండా క్రియను చిత్రించటం, వర్తమాన కాలాన్ని భూతం (నిజంగా భూతమే) చేయటం, శరీరపు కదలికలన్నీ భూమ్యాకర్షణ శక్తిని దాటిపోవడం,

అర్థవిశేషణ పదానికి శబ్దవిశ్లేషణ నాపాదించటం, స్వప్నశక్తిని అంతఃకరణశక్తిగా నిరూపించటం-ఇవీ ఈ నవలాకారుడు చేసిన గొప్ప ప్రయోగాలు. అపోహనే ఊహ చేయటం, వితర్కాన్ని కుతర్కించటం, సంఘటనా క్రమాల్ని నిర్మూలిస్తూనే ఉన్మీలనం చేయటం, వ్యక్తినుంచి నీడల్ని లాక్కోవటం, మనుషత్వం కంటే దాంబికతే ఎప్పటికయినా విశ్వసనీయమని తన రచనోద్వేగంలో నిరూపించటం శ్రీరామకవచం సాధించిన గొప్ప విజయం. విశేషణ విశేష్యాలు రెండూ కలిసి ఒకేచోటవుండి మన భావనా ప్రపంచానికి కొత్తద్వారాలు తీసాడు సాగర్. ఈ నవల సాధించిన ఘనత మరొకటుంది...సంశయాన్ని రేపటం, సంశయం ద్వారానే మీమాంస మొదలు. ఈ నవల ఒక సంశయ కోరిక!

**- మో**

(నవ్య - 14/12/2005)